www.centreforliberty.org

**పత్రికా ప్రకటన**

**పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో తీవ్రమైన ఇంజనీరింగ్ లోపాలు, భద్రతా ప్రమాణాల ఉల్లంఘనలను బట్టబయలు చేసిన 'సెంటర్ ఫర్ లిబర్టీ'**

**విజయవాడ, మార్చి 2, 2026** — ఆంధ్రప్రదేశ్ జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో జరుగుతున్న తీవ్రమైన ఇంజనీరింగ్ లోపాలు, కొనసాగుతున్న భద్రతా ప్రమాణాల ఉల్లంఘనలపై వాస్తవ ఆధారాలను ప్రజల ముందు ఉంచేందుకు "సెంటర్ ఫర్ లిబర్టీ" ఆధ్వర్యంలో ఈరోజు విజయవాడలోని హోటల్ ఐలాపురంలో విలేకరుల సమావేశం జరిగింది.

ముందుగా శ్రీ యెదురూరి శ్రీనివాస్ రెడ్డి పోలవరం ప్రాజెక్టు సమస్య తీవ్రతను పరిచయం చేస్తూ సమావేశాన్ని ప్రారంభించి, వక్తలను ఆహ్వానించారు.

**వాస్తవ ఆధారాల ప్రదర్శన (Presentation):** శ్రీ నలమోతు చక్రవర్తి పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా అధికారిక రికార్డులు, కేంద్ర జల సంఘం (CWC), పోలవరం ప్రాజెక్ట్ అథారిటీ (PPA), అంతర్జాతీయ నిపుణుల కమిటీ (PoE) నివేదికల ఆధారంగా 5 కీలక వైఫల్యాలను వెల్లడించారు :

- **డయాఫ్రమ్ వాల్ (D-Wall) నాణ్యతా లోపాలు:** అత్యంత కీలకమైన డయాఫ్రమ్ వాల్ నిర్మాణంలో తీవ్రమైన నాణ్యతా లోపాలు జరిగాయి . రోజా కాంక్రీట్ 'బ్లీడింగ్' జరగడం వల్ల గోడ పటుత్వం దెబ్బతింటోందని, ఆ పగుళ్లను ప్లాస్టరింగ్ చేసి కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తున్నారని ఆధారాలతో చూపించారు .
- **డయాఫ్రమ్ వాల్ ఎత్తు అనధికారిక కుదింపు:** నాణ్యతా లోపాలను సరిదిద్దాల్సింది పోయి, సుమారు 400 మీటర్ల పొడవునా గోడ ఎత్తును 19 మీటర్ల నుంచి 18.5 మీటర్లకు కుదించారు .
- **గ్యాప్-1 (Gap-I) లోతు కుదింపు:** ఎలాంటి ముందస్తు అనుమతులు, సరైన కారణాలు లేకుండా గ్యాప్-1 ట్రెంచ్ లోతును 23 మీటర్ల నుంచి 24 మీటర్లకు కుదించి మార్చారు . ఇది డ్యామ్ భద్రతకు పెను ముప్పు.
- **గైడ్ బండ్ (Guide Bund) నిర్లక్ష్యం:** 2023లో కొట్టుకుపోయిన స్పిల్వే గైడ్ బండ్ పునర్నిర్మాణాన్ని తీవ్రంగా నిర్లక్ష్యం చేస్తున్నారు . దీనిని ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా మొత్తం స్పిల్వేకే ప్రమాదం వాటిల్లుతుంది.

- **అప్రోచ్ ఛానల్ తవ్వకాల అర్థాంతర నిలిపివేత:** స్పిల్వే అప్రోచ్ ఛానల్ లో ఇంకా 38.55 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి తవ్వాల్సి ఉండగా, కేవలం 5 లక్షల క్యూబిక్ మీటర్లు మాత్రమే ఉందని లెక్కలు తారుమారు చేసి తవ్వకాలను అర్థాంతరంగా నిలిపివేసే కుట్ర జరుగుతోంది .

**సమన్వయ లోపం - బాధ్యతారాహిత్యం:**

సెంటర్ ఫర్ లిబర్టీ చైర్మన్ శ్రీ ఏ.బీ. వెంకటేశ్వర రావు ప్రసంగిస్తూ, ఈ వైఫల్యాలకు కారణమైన సంస్థల (CWC, PoE, జలవనరుల శాఖ, కాంట్రాక్టర్లు తదితర) మధ్య సమన్వయ లోపం, ఎవరికీ బాధ్యత లేకపోవడం వల్లే ఈ ఘోరమైన ఇంజనీరింగ్ వైఫల్యాలు జరుగుతున్నాయని తీవ్రంగా విమర్శించారు. ఆయన మాట్లాడుతూ ఒక కీలకమైన ప్రశ్న సంధించారు: **"ఈరోజు గైడ్ బండ్ కుంగిపోయింది. రేపు ప్రాజెక్టుకు గుండెకాయ లాంటి డయాఫ్రమ్ వాల్ (D-Wall) కు కూడా అదే గతి పడితే, దానికి ఎవరు బాధ్యత వహిస్తారు?"** అని ఆయన ప్రభుత్వాన్ని, అధికారులను నిలదీశారు.

భవిష్యత్తులో పెను ప్రమాదాన్ని నివారించడానికి సంస్థ ఈ కింది డిమాండ్లను ముందుంచింది:

- **స్వతంత్ర అంతర్జాతీయ నిపుణుల కమిటీ ఏర్పాటు:** ప్రస్తుత కాంట్రాక్టుతో సంబంధం లేని స్వతంత్ర నిపుణుల కమిటీతో డయాఫ్రమ్ వాల్ పటుత్వాన్ని పరీక్షించాలి.
- **స్వతంత్ర క్వాలిటీ కంట్రోల్ నియామకం:** కాంట్రాక్ట్ ఏజెన్సీల ప్రభావం లేని స్వతంత్ర పీఎంసీ (PMC) మరియు క్వాలిటీ కంట్రోల్ (QC) ఏజెన్సీని తక్షణమే నియమించాలి.
- **పనుల వేగం తగ్గింపు (Slow Down):** భద్రతను పణంగా పెట్టి పనులు వేగంగా చేయకూడదు. నాణ్యత నిర్ధారణ జరిగే వరకు ECRF డ్యామ్ పనులను నెమ్మదింపజేయాలి.
- **గైడ్ బండ్ కు ప్రాధాన్యత:** గైడ్ బండ్ మరమ్మతులకు తక్షణమే వనరులను మళ్లించి పనులు పూర్తి చేయాలి.
- **పారదర్శకత:** కాంక్రీట్ పనులకు సంబంధించిన రోజువారీ నివేదికలు, సోనిక్ లాగింగ్ (CSL) టెస్ట్ ఫలితాలను ప్రజల పరిశీలనార్థం పబ్లిక్ డొమైన్ లో ఉంచాలి .
- **బాధ్యులపై చర్యలు:** 2023 నాటి గైడ్ బండ్ వైఫల్యానికి కారణమైన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలి.

ఈ ఇంజనీరింగ్ ఉల్లంఘనలను ఇలాగే వదిలేస్తే, ప్రాజెక్టు దిగువన ఉన్న లక్షలాది మంది ప్రజల ప్రాణాలను రక్షించేందుకు సుప్రీం కోర్టును ఆశ్రయించి సేఫ్టీ ఆడిట్ కోరతామని సెంటర్ ఫర్ లిబర్టీ హెచ్చరించింది.

**మీడియా సంప్రదింపులకు:** హరీష్ ఫోన్: 83099-26925 వెబ్సైట్: www.centreforliberty.org